# సాక్షి రాజన్న సిరిసిల్ల

గురువారం । 20 । ఏప్రిల్ । 2023




## రాజన్న సన్నిధిలో భక్తులు

వేములవాడ: రాజన్నను బుధవారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు కోడెమొక్కులు చెల్లించుకున్నారు.



## 'కంటి వెలుగు' ప్రారంభం

సిరిసిల్లఅర్బన్: చంద్రంపేటలో కంటివెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ బుధవారం ప్రారంభించారు. కౌన్సిలర్ పాతూరి రాజిరెడ్డి ఉన్నారు.

గరిష్టం/కనిష్టం
41.0/27.0

## వాతావరణం

ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళలో కనిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

తమ సంపదను దైవమార్గంలో ఖర్చు చేసేవారికి దైవ అనుగ్రహం లభిస్తుంది.
– మహమ్మద్ ప్రవక్త

| | ఇఫ్తార్ | | సహర్ |
|---|---|---|---|
| గురు | 6:37 | శుక్ర | 4:29 |

## రంజాన్ వేళలు

## న్యూస్‌రీల్

### నిబంధనలు పాటిస్తేనే అనుమతులు



వేములవాడలో తనిఖీ చేస్తున్న వైద్యబృందం

సిరిసిల్ల: జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబుల్లో వైద్య, ఆరోగ్యశాఖ నిబంధనలు పాటిస్తేనే అనుమతులు ఇస్తామని జిల్లా డిప్యూటీ వైద్యాధికారి శ్రీరాములు స్పష్టం చేశారు. వేములవాడలోని విజేత ఆర్థో హాస్పిటల్, మానస పిల్లల ఆస్పత్రి, దేవిశ్రీ ల్యాబులను బుధవారం తనిఖీ చేశారు. శ్రీరాములు మాట్లాడుతూ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అనుమతి లేకుండా ఆస్పత్రి, ల్యాబ్‌లను ఏర్పాటు చేయరాదన్నారు. నిబంధనలు పాటించని వారికి నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. డీఈఎంవో సంతోశ్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి చింతోజు భాస్కర్, హెచ్‌ఈ బాలయ్య, హెచ్‌ఈవో జలపతి పాల్గొన్నారు.

### గుండెపోటుపై అవగాహన పెంచుకోవాలి



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వేణుమాధవ్

సిరిసిల్ల: ప్రస్తుత పరిస్థితుల్లో గుండెపోటుపై అవగాహన పెంచుకోవాలని డాక్టర్ వేణుమాధవ్ కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు, అంగన్‌వాడీ టీచర్లకు కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్)పై అవగాహన కల్పించారు. గుండెపోటు వస్తే వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ వేణుమాధవ్ వివరించారు. మంచి ఆహార అలవాట్లతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వెలసిన ఫ్లెక్సీలు




దాచారంలో వెలసిన ఫ్లెక్సీ

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంటతోపాటు దాచారంలో మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు వ్యతిరేకంగా గుర్తుతెలియని వ్యక్తులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దళితబంధు, డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు, అరుంధతి కల్యాణ మండపం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సీసీ రోడ్లు, కుల సంఘాలకు భవనాలు ఇతర హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఈ ఫ్లెక్సీలు ఎవరు ఏర్పాటు చేశారనే దానిపై పోలీసులు విచారణ చేపట్టారు.

### పండుగలకు సర్కార్ పెద్దపీట



కానుకలు అందజేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అన్ని మతాల పండుగలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలోని ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం ముస్లింలకు రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. ఆగయ్య మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా సబ్బండ వర్గాలు సంతోషంగా పండుగలు చేసుకోవాలని ప్రభుత్వం కానుకలు అందిస్తుందన్నారు. ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, మండల కో–ఆప్షన్ సభ్యుడు జబ్బర్, మండల సర్పంచుల ఫోరం కన్వీనర్ కొండాపురం బాల్‌రెడ్డి, తహసీల్దార్ జయంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యత నగుబాటే!



సిరిసిల్లలోని ఆటోనగర్ ప్రాంతం. కరీంనగర్ మార్గంలో సిరిసిల్లలోకి ప్రవేశిస్తుండగా కనిపించే ఏరియా. ఇక్కడ 2019లో పుట్‌పాత్ నిర్మించారు. నాణ్యత లోపంతో రెండు వైపులా ఉన్న పుట్‌పాత్ టైల్స్ చెదిరిపోయాయి. భారీ వర్షాలు, వరదలతో పట్టణ ప్రవేశంలోనే సుందరీకరణ పనులు కళావిహీనంగా మారాయి.



ఇక్కడ మ్యాన్‌హోల్స్ మూతలు దొంగలు పాలైన ప్రాంతం సిరిసిల్లలోని ఆటోనగర్. వీటిపై ఉండే మూతలు దొంగలపాలు కాగా ఎలాంటి రక్షణ లేకుండా చెత్తా, చెదారంతో నిండి ఉన్నాయి. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా మ్యాన్‌హోల్స్‌లో పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఏడాదిగా ఇలాగే ఉంటున్న మున్సిపల్ అధికా రులు మాత్రం పట్టించుకోవడం లేదు.




సిరిసిల్లలోని ప్రధాన కూడళ్లలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పుట్‌పాత్‌లపై టైల్స్ లేచిపోయాయి. కోర్టు ముందు, గాంధీచౌక్‌లో, మార్కెట్ ఏరియాలో ఇలా పుట్‌పాత్‌లు కబ్జాలకు గురయ్యాయి. వీటిపైనే వ్యాపారులు సామగ్రి ఉంచుతుండడంతో టైల్స్ శిథిలమవుతున్నాయి.

- మూన్నాళ్ల ముచ్చటగా పనులు
- చెదిరిన సిరిసిల్ల సుందరీకరణ
- రూ.50 కోట్ల పనుల్లో లోపించిన నాణ్యత
- లేచిన టైల్స్.. దొంగలపాలైన మ్యాన్‌హోల్ మూతలు

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలనే లక్ష్యంతో నాణ్యతను పట్టించుకోలేదు. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తుంది. పది కాలాలపాటు ఉండాల్సిన పనులు మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు పట్టణాభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తే.. క్షేత్రస్థాయిలో మాత్రం నాణ్యత లేని పనులు చేస్తున్నారు. సిరిసిల్ల సుందరీకరణకు రూ.50కోట్లు మంజూరు చేయగా.. ఆ నిధులతో చేసిన హడావుడి పనులు క్యూరింగ్ లేక.. చెదిరిపోయాయి.

**కలెక్టర్ మందలించినా..**

సిరిసిల్లలోని కరీంనగర్–కామారెడ్డి ప్రధాన రోడ్డును 100 అడుగులు, సిరిసిల్ల–సిద్దిపేట ప్రధాన రోడ్డును 80 అడుగులతో విస్తరించారు. ఈ ప్రధాన రోడ్లపై ఐదు అడుగులతో మురికికాలువలను, పుట్‌పాత్‌లను నిర్మించారు. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ఈ పనులు చేశారు. నాణ్యత లేక కుంగిపోవడం, శిథిలమవడంతో ఇప్పుడు దారుణంగా కనిపిస్తున్నాయి. పనులు చేస్తున్న సమయంలోనే అప్పటి కలెక్టర్ వెంకట్రామిరెడ్డి నాణ్యత లోపించిందని మందలించారు. కానీ ఆర్ అండ్‌బీ అధికారుల్లో మార్పు రాలేదు. ఫలితంగా నాసిరకంగా పనులు పూర్తి చేశారు.

**అవార్డులు సరే..**

సిరిసిల్ల పట్టణం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో అవార్డులు అందుకుంటుంది. తడి, పొడి చెత్త సేకరణ, వినియోగంలో ముందుంది. కానీ సిరిసిల్ల పట్టణ అందాలు మాత్రం ఇలా శిథిలమయ్యాయి. రాష్ట్ర మంత్రి కేటీఆర్ సహకారంతో ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్) సాధిస్తున్నా.. క్షేత్రస్థాయిలో పనుల్లో నాణ్యత లేక ప్రజాధనం వృథా అవుతోంది. ఇప్పటికైనా మున్సిపల్ పాలకవర్గం, ఇంజినీరింగ్ అధికారులు చెదిరిన అందాలను బాగు చేస్తే.. సిరిసిల్ల పట్టణ ప్రధాన రోడ్లు బాగుంటాయి.

### ఇది సిరిసిల్ల స్వరూపం..

| | |
|---|---|
| వార్డులు | 39 |
| జనాభా | 1.10 లక్షలు |
| పట్టణ విస్తీర్ణం | 55.47 చదరపు కిలోమీటర్లు |
| రెవెన్యూ వార్డులు | 12 |
| కుటుంబాలు | 33,608 |
| అభివృద్ధి చేసిన ప్రధాన రోడ్లు | 15 కిలోమీటర్లు |
| వెచ్చించిన నిధులు | రూ.50 కోట్లు |

### రిపేర్లు చేస్తున్నాం



సిరిసిల్లలో అవసరమైన చోట్ల రిపేర్లు చేస్తున్నాం. అధిక వర్షాలు, వరదలతో కొన్ని ప్రాంతాల్లో రోడ్లు చెదిరిపోయాయి. వాటిని బాగు చేసే పనులు చేస్తున్నాం. ఏమైనా గ్యాప్స్ ఉంటే పూర్తి స్థాయిలో బాగు చేస్తాం. సిరిసిల్లలో పుట్‌పాత్‌లను ఆక్రమించే వారిపై చర్యలు తీసుకుంటాం. – సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, సిరిసిల్ల

### నాంపల్లి గుట్టపైకి లిఫ్ట్ కోసం రూ.కోటి విరాళం



విరాళం ప్రకటించిన నవీన్‌చందర్ రాజు దంపతులతో ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: వేములవాడ రాజన్న దత్తత ఆలయం నాంపల్లి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం లిఫ్ట్ ఏర్పాటుకు హైదరాబాద్‌కు చెందిన లెక్చరర్ తుమికి నవీన్‌చందర్‌రాజు దంపతులు రూ.కోటి విరాళం ఇస్తామని ప్రకటించారు. దీంతో వారిని ఎమ్మెల్యే రమేశ్‌బాబు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

### చట్టాలపై అవగాహన అవసరం

- షీటీమ్ ఎస్సై ప్రేమ్‌దీప్



మాట్లాడుతున్న షీటీమ్ ఎస్సై ప్రేమ్‌దీప్

సిరిసిల్లక్రైం: మహిళలు, విద్యార్థినుల రక్షణకు ఉన్న చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని షీటీమ్ ఎస్సై ప్రేమ్‌దీప్ పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణంలోని జ్యోతి బీఈడీ కళాశాలలో బుధవారం విద్యార్థినులకు షీటీమ్‌పై అవగాహన కల్పించారు. మహిళల హక్కులు, రక్షణకు షీటీమ్ ప్రత్యేకంగా పనిచేస్తుందన్నారు. విద్యార్థినులను వేధింపులకు గురిచేసిన, ర్యాగింగ్ చేసిన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. స్కూళ్లు, కళాశాల, బస్టాప్ ఇతర నిర్మాణ ప్రాంతాలలో ఎవరైన అమ్మాయిలను వేధిస్తే షీటీమ్ పోలీస్ హెల్ప్‌లైన్ 8712656425, డయల్ 100 సమాచారం అందిస్తే రక్షణ కల్పిస్తామని తెలిపారు. షీటీమ్ పనివిధానం, పోక్సో చట్టం, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, అమ్మాయిల వేధింపులపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930లో సమాచారం ఇవ్వాలని కోరారు. షీటీమ్ ఏఎస్సై ప్రమీల, షీటీమ్, కళాశాల సిబ్బంది ఉన్నారు.

## ప్రభుత్వ వృద్ధుల సంరక్షణ కేంద్రం సిద్ధం

- కలెక్టర్ అనురాగ్ జయంతి



మండేపల్లి వృద్ధాశ్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం మండెపల్లి పరిధిలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వృద్ధాశ్రమం సిద్ధమైందని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం వృద్ధుల సంరక్షణ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. పడక గదులు, భోజనశాల, వంటగది, సరుకులు నిలువచేసే గది, ఫిజియోథెరపీ గది, వస్తువులు, డాక్టర్ గది, టీవీ గది పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వయోవృద్ధుల సంరక్షణ కేంద్రంలో వృద్ధులను చేర్చుకోవాలని జిల్లా సంక్షేమాధికారి పి.లక్ష్మీరాజంను ఆదేశించారు. చుట్టుపక్కల పరిసరాలను మరింత సుందరంగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో పి.లచ్చాలుకు సూచించారు.

**మన ఊరు–మన బడి పనులు పూర్తి చేయండి**

సిరిసిల్లఅర్బన్: జిల్లాలో మన ఊరు–మన బడి కార్యక్రమం క్రింద చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డితో కలిసి బుధవారం మన ఊరు–మన బడి, స్వచ్ఛసర్వేక్షన్, ఉపాధిహామీ పనుల ప్రగతిపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్–2023 సర్వేలో అభివృద్ధి కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో చేపట్టాలని సూచించారు. ఉపాధీహామీ కూలీల సంఖ్యను పెంచి పనులు పూర్తి చేయాలని, ప్రతీ జాబ్‌కార్డుకు వంద రోజుల పని కల్పించాలన్నారు. డీపీవో రవీందర్, అదనపు డీఆర్‌డీవో మదన్‌మోహన్, ఐడీఎం మల్లికార్జున్ ఉన్నారు.

## ప్రజా ఫిర్యాదులపై స్పందించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- ఎల్లారెడ్డిపేట పోలీసుస్టేషన్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పోలీసులు ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ఎల్లారెడ్డిపేట పోలీసుస్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. ఠాణా పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఎలాంటి ఫిర్యాదులు వస్తున్నాయో తెలుసుకోవడంతో పాటు పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యల గురించి ఆరా తీశారు. ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో బ్లూకోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నిర్వహించే సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని సూచించారు. డయల్ 100కు కాల్ రాగానే వెంటనే సంఘటన స్థలానికి చేరుకోవాలన్నారు. ప్రమాదాల నివారణకు నిరంతరం డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. సీఐ మొగిలి, ఎస్సై శేఖర్ ఉన్నారు.

## పాడెక్కే శవానికి పోస్టుమార్టం

- సిరిసిల్లలో అంత్యక్రియలు అడ్డుకున్న పోలీసులు
- వారం క్రితం రోడ్డు ప్రమాదం
- చికిత్స పొందుతూ మృతిచెందిన యువకుడు
- అంత్యక్రియల అడ్డగింతతో రోడ్డెక్కిన బంధువులు



పోస్టుమార్టంకు తరలిస్తున్న మృతదేహం



పోలీసులు, బంధువుల వాగ్వాదం

సిరిసిల్లటౌన్/సిరిసిల్లక్రైం: మరికొద్ది నిమిషాల్లో అంత్యక్రియలు పూర్తవుతాయనుకుంటుండగా హఠాత్తుగా పోలీసులు ప్రత్యక్షమయ్యారు. అంత్యక్రియలు ఆపివేయాలని.. వెంటనే పోస్టుమార్టమ్‌కు తరలించాలన్న పోలీసుల మాటలతో బంధువులు ఆగ్రహానికి గురయ్యారు. పోలీసుల తీరుపై వారు నిరసన తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిరిసిల్ల పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన వడ్రంగి విశ్వనాథుల నాగరాజు(40) ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ వద్ద గత శుక్రవారం రోడ్డు ప్రమాదానికి గురికాగా.. కాలు విరిగిపోయింది. అప్పటి నుంచి సిరిసిల్ల జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బీపీ, షుగర్ లెవల్స్ తగ్గాక ఆపరేషన్ చేయాలని వైద్యులు నిర్ణయించారు. మంగళవారం కాలుకు ఆపరేషన్ చేసేందుకు సిద్ధమవుతుండగా నాగరాజుకు హఠాత్తుగా గుండెపోటు వచ్చింది. కుటుంబసభ్యుల ఎదుటే సీపీఆర్ చేసిన బతుకలేదు. గుండెపోటుతో చనిపోవడంతో పోలీసుల సూచనలతో మంగళవారం రాత్రి మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు.

**శ్మశాన వాటికలో అంత్యక్రియలు అడ్డగింత**

బుధవారం ఉదయం అంత్యక్రియలు చేసేందుకు సిరిసిల్ల శ్మశానవాటికకు కుటుంబ సభ్యులు, బంధువులు చేరుకున్నారు. కొద్ది నిమిషాలలో పాడెపై నాగరాజు మృతదేహాన్ని ఉంచే సమయంలో పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. పోస్టుమార్టం నిర్వహించకుండా ఎలా అంత్యక్రియలు చేస్తారంటూ బంధువులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈక్రమంలో నాగరాజు బంధువులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎస్సై స్థాయి అధికారి మంగళవారం పోస్టుమార్టం అవసరం లేదని శవాన్ని అప్పగించారని వారు వాపోయారు. నిబంధనల ప్రకారం పోస్టుమార్టం నిర్వహించాలని పోలీసులు ఖరాఖండిగా చెప్పడంతో బంధువులు ఆవేదనకు గురయ్యారు. అంత్యక్రియలకు వచ్చిన శవాన్ని తిరిగి పోస్టుమార్టంకు తీసుకెళ్లడం సరికాదన్న.. పోలీసులు మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం కోసం పిటిషన్ ఇవ్వాలని పోలీసులు తెలపడంతో బంధువులు ఆగ్రహానికి గురయ్యారు. పోలీసులు, బంధువుల మధ్య వాగ్వాదం జరిగింది.

**రోడెక్కిన బంధువులు**

పోలీసులు, వైద్యుల తీరును నిరసిస్తూ మృతుడు నాగరాజు బంధువులు బుధవారం మధ్యాహ్నం సిరిసిల్ల అంబేద్కర్‌చౌక్‌లో రాస్తారోకో చేపట్టారు. గుండెపోటుతో మరణించాడని వైద్యుల నిర్ధారించారని, పోలీసులు కూడా సమ్మతించి మృతదేహాన్ని తమకు అప్పగించారని పేర్కొన్నారు. దూరపు బంధువులు కడచూపు కోసమే బుధవారం చేయాలని నిర్ణయించుకుంటే పోలీసుల వైఖరి దారుణంగా ఉందన్నారు. ట్రాఫిక్‌జామ్ కావడంతో సీఐ అనిల్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని బంధువులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. వైద్యులతో మాట్లాడి పోస్టుమార్టం చేపించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కాగా ఆపరేషన్ ప్రారంభం కాకముందే వరుసగా రెండుసార్లు గుండెపోటు వచ్చిందని తమ సిబ్బంది ప్రయత్నించిన ఫలితం లేకపోయిందని జిల్లా ఆసుపత్రి పర్యవేక్షణాధికారి డాక్టర్ మురళీధర్‌రావు తెలిపారు. పోస్టుమార్టం విషయంలో చిన్నపాటి సమన్వయ లోపం జరిగిందని సీఐ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. బంధువుల ఫిర్యాదుతో నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారులు శ్రీనివాస్, శివమణి ఉన్నారు.

## అదనపు టీఎంసీ పనులపై ఆర్డీవో ఆరా

బోయినపల్లి(చొప్పదండి): వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్ బుధవారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలో చేపడుతున్న అదనపు టీఎంసీ వరదకాల్వ స్థితిగతులు తెలుసుకున్నారు. వరదకాల్వ నిర్మాణంలో ఇళ్లు ముంపునకు గురవుతున్న దేశాయిపల్లి గ్రామ గెజిట్, ఆర్‌అండ్‌ఆర్ గురించి చర్చించినట్లు తెలిసింది. అదనపు టీఎంసీ భూసేకరణ, పరిహా రం పంపిణీ తదితర విషయాలపై ఆరా తీశారు. తహసీల్దార్ నరేశ్, ఆర్‌ఐ ప్రభాకర్ పాల్గొన్నారు.

### 3,159 మందికి కంటి వెలుగు పరీక్షలు

సిరిసిల్లఅర్బన్: జిల్లాలో బుధవారం 3,159 మందికి కంటి వెలుగులో పరీక్షలు చేశారు. ఇందులో 396 మందికి రీడింగ్‌గ్లాస్‌లు, 424 మందికి పాయింట్ అద్దాలను అందించారు. జిల్లా వ్యాప్తంగా 21 క్యాంపులను నిర్వహించగా 189 మంది పాల్గొన్నారు.

## మండుతున్న ఎండలు

ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఉదయం 10 గంటలు దాటిందంటే జనం బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. అత్యవసర పని ఉన్న వారు నెత్తిన గుడ్డలు కట్టుకుంటున్నారు. ఒక్కపూట బడులు కావడంతో మధ్యాహ్నం 12.30 గంటలకు స్కూల్ నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు ఎండ నుంచి కాపాడుకునేందుకు చెట్ల నీడన, ఇళ్ల నీడన నడుచుకుంటూ వెళ్తున్నారు. చాలా మంది ఎండ నుంచి ఉపశమనానికి చల్లని జ్యూస్‌లు తాగుతున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల



ట్రాఫిక్ కంట్రోల్ స్టాండ్ నీడలో సేదతీరుతున్న విద్యార్థులు




ఎండ నుంచి రక్షణకు ఇలా..






దాహం తీర్చుకుంటున్న వృద్ధుడు

## క్లుప్తంగా

### జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అన్నల్‌దాస్ గణేశ్

సిరిసిల్లటౌన్: గ్రామపంచాయితీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జీపీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నల్ దాస్ గణేశ్ కోరారు. సిరిసిల్లలోని యూనియన్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. గతేడాదిగా కార్మికులకు వేతనాలు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడిగా పెండింగ్‌లో ఉంటున్న కార్మిక సమస్యల సాధనకు జూన్ 1 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్మికులకు రూ.24వేల కనీస వేతనం చెల్లించాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కోడం రమణ, మల్లయ్య, బాబు పాల్గొన్నారు.

### ముస్లింలకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందిస్తున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ: రంజాన్ పండుగను పురస్కరించుకొని పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ నిరుపేద ముస్లింలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఆధ్వర్యంలో ఏటా నిరుపేద ముస్లింలకు రంజాన్ కానుకలను అందిస్తున్నట్లు తెలిపారు. పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రేగుల సంతోష్‌బాబు, దులేబాషా, ఫక్రు, రేగుల మల్లికార్జున్, ముప్పిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

### బహిరంగ సభను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

తంగళ్లపల్లి (సిరిసిల్ల): ఈ నెల 21న సిరిసిల్ల పట్టణం బీవైనగర్ కట్టమైసమ్మ వద్ద జరిగే సీపీఐ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో సీపీఐ బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. కార్మిక, రైతులు బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మంచికట్ల రమేశ్, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామల మల్లేశం, జిల్లా నాయకులు సోమ నాగరాజు, నారాయణ, చంద్రమౌళి, రాజశేఖర్, బాలమల్లు, గంగమణి, సుజాత, సౌజన్య, భారతి తదితరులు పాల్గొన్నారు.





# నెల రోజుల్లో పింజర్ల డబ్బులు

- రెండో విడత డబ్బుల కోసం ఆసాముల డిమాండ్
- సర్కారు ఇస్తే ఒకే.. లేకుంటే యజమానులే భరించాలి
- యజమానులు, ఆసాములకు మధ్య కుదిరిన ఒప్పదం



ఒప్పంద పత్రాన్ని చూపుతున్న యజమానులు, ఆసాములు

సిరిసిల్ల : బతుకమ్మ చీరెలు నేసిన ఆసాములకు ప్రభుత్వం ద్వారా రావాల్సిన పింజర్ల డబ్బులను నెలరోజుల్లో ఇప్పించేందుకు బుధవారం ఒప్పందం కుదిరింది. పాలిస్టర్ అసోసియేషన్ యజమానులు, ఆసాములకు మధ్య కుదిరిన పరస్పర అంగీకారం మేరకు ఆసాములు సమ్మెను విరమించారు. 2021లో మరమగ్గాలకు ఆసాములు పింజర్లను బిగించుకున్నారు. వీటికి అయ్యే ఖర్చులను జౌళిశాఖ రెండు దఫాలుగా చెల్లిస్తుందని అప్పటి జౌళిశాఖ కమిషనర్ శైలజా రామయ్యర్ స్పష్టం చేశారు. ఈ మేరకు 2022లో మీటర్‌కు రూ.1.50 చొప్పున బతుకమ్మ చీరెలు నేసిన ఆసాములకు ఒక్క విడత పింజర్ల డబ్బులను జౌళిశాఖ మంజూరు చేసింది. రెండో విడత రావాల్సి ఉండగా ఇప్పటి వరకు డబ్బులు రాలేదు. దీంతో సిరిసిల్ల ఆసాములు సమ్మె నోటీస్ ఇచ్చి పింజర్ల డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రెండ్రోజులుగా ఆసాములు ఆందోళనకు దిగారు. కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. దీంతో యజమానులు ఆసాములను చర్చలకు పిలిపించి సమస్యలపై చర్చించారు.

**ఇదీ ఒప్పందం...**

ఆసాములకు రావాల్సిన చివరి దఫా పింజర్ల డబ్బులు మే 20 లోగా ప్రభుత్వం ద్వారా ఇప్పించేందుకు ప్రయత్నం చేయాలి. జౌళిశాఖ ద్వారా పింజర్ల డబ్బులు వస్తే సరే. ఒకవేళ ఆలస్యమైనా, రాకపోయినా యజమానులే పింజర్ల డబ్బులను భరించాలి. ఈ మేరకు ఆసాముల ఖాతాల్లో డబ్బులు జమచేయాలి. గతంలో బతుకమ్మ చీరెలకు పింజర్ల డబ్బులు ఎంతవచ్చాయో ఆ మేరకు యజమానులు చెల్లించాలి. ఈ మేరకు రాష్ట్ర పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సాగర్, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్ సమక్షంలో యజమానులు, ఆసాములకు మధ్య ఒప్పందం కుదిరింది. పరస్పర చర్చల్లో పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు మండల సత్యం, కార్యదర్శి యెల్దండి దేవదాస్, ఉపాధ్యక్షుడు బూట్ల నవీన్‌కుమార్, మాజీ అధ్యక్షులు గోవిందు రవి, దూడం శంకర్, బూర కనకరాజేశం, ఆసాముల ప్రతినిధులు సిరిసిల్ల రవి, చేరాల అశోక్, మండల బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

# శక్తివంతంగా గ్రామీణ ప్రాంత యువత

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

కోనరావుపేట(వేములవాడ): గ్రామీణ ప్రాంతాల్లోని యువత శక్తివంతంగా మారిందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, ఇవ్వని హామీలను సీఎం కేసీఆర్ నెరవేరుస్తున్నారన్నారు. తెలంగాణలో ఒకప్పుడు నక్సలైట్లు, పోలీసుల కాల్పులు, రైతులు ఆత్మహత్యలు కనిపించేవని, సమస్యల పరిష్కారం కోసమే ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నట్లు తెలిపారు. ఎంపీగా బండి సంజయ్ చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాట్లాడుతూ మండలంలో 11564 మంది రైతులకు రూ.117 కోట్లు రైతుబంధు కింద అందిస్తున్నామని, 160 మందికి రూ. 80 కోట్లు రైతుభీమాగా చెల్లించినట్లు తెలిపారు. త్వరలో 4వేల డబుల్ బెడ్రూమ్ ఇళ్లను నిర్మించి ఇస్తామన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టెక్స్‌టైల్ రాష్ట్ర చైర్మన్ గూడూరి ప్రవీణ్‌కుమార్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సింగిల్‌విండో చైర్మన్లు సంకినేని రాంమోహన్‌రావు, బండ నర్సయ్య, సర్పంచుల ఫోరం కన్వీనర్ పర్శయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, వైస్ చైర్మన్ తిరుపతి, టెక్స్‌టైల్ రాష్ట్ర చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### సభను విజయవంతం చేయండి

వేములవాడ : మే 4న సరూర్‌నగర్‌లో జరిగే ప్రియాంకా గాంధీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మహిళా కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జి పద్మ విజ్ఞప్తి చేశారు. బుధవారం వేములవాడలోని ఆది శ్రీనివాస్ నివాసంలో విలేకరులతో మాట్లాడారు. త్వరలోనే జిల్లా, బ్లాక్, మండల, గ్రామ కమిటీలు వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు పాత సత్యలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు సానియా, పట్టణ, మండల అధ్యక్షురాళ్లు తోట లహరి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్నస్వామి వెలిశారని పూజలు

- బండపల్లికి తరలివచ్చిన చుట్టుపక్కల గ్రామస్తులు



విగ్రహం వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం బండపల్లిలోని పురాతన మల్లన్నస్వామి గుడి వెనుక గుట్టపై బండరాళ్ల మధ్య మల్లన్నస్వామి విగ్రహం బుధవారం ప్రత్యక్షమైంది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల వారు భారీ ఎత్తున తరలివచ్చి పూజలు చేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. బండపల్లికి చెందిన మానుక తిరుపతి మర్రి ఆకుల పాల కోసం గుట్టపైకి వెళ్లి వస్తుండగా బండరాళ్ల మధ్య ఉన్న సొరంగంలో విగ్రహం కనిపించింది. వెంటనే అక్కడే ఉన్న మ్యాకల కొమురయ్యకు చూపించగా.. మల్లన్నస్వామి విగ్రహం అని తెలిపారు. అదే సమయంలో ఉపాధిహామీ పనులకు వెళ్తున్న కూలీలు గమనించి విగ్రహం వెలిసిందని తెలిసిన వారికి చెప్పారు. ఇలా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు సైతం తెలియడంతో భారీగా తరలివచ్చారు. ఒగ్గు పూజారిని తీసుకొచ్చి పూజలు చేశారు. గుట్ట ప్రాంతం భక్తులతో కిక్కిరిసిపోయింది. సర్పంచ్ న్యాత విజయజార్జ్, మాజీ సర్పంచ్ కటకం మల్లేశం, యాదవ సంఘం నాయకులు కోరె మల్లేశం, మ్యాకల హన్మంతు, మానుక దేవయ్య, బడే మల్లయ్య, గడ్డం కుర్మ రాయమల్లయ్య, అనిల్, శ్రీనివాస్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

# ‘భట్టి’ పాదయాత్రకు నీరాజనం

- భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు
- ఘన స్వాగతం పలికిన కాల్వశ్రీరాంపూర్ నేతలు
- సమస్యలు తెలుసుకుంటూ.. ముందుకు సాగిన భట్టి
- గంగారంలో బస.. నేడు మండల కేంద్రంలో సభ



పాదయాత్రలో పాల్గొన్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

కాల్వశ్రీరాంపూర్: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్‌లో భాగంగా చేపట్టిన పాదయాత్రకు జనం నీరాజనం పలికారు. బుధవారం జిల్లాకేంద్రం నుంచి ఆయన పాదయాత్ర ప్రారంభించి.. కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పాదయాత్రలో ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ.. వారి సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఆయనకు అడుగడుగునా భారీసంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఘనస్వాగతం పలికారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛం అందించి పూలమాలతో సన్మానించారు. కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన రిటైర్డ్ ఎంఈవో పులి మల్లారెడ్డి కోడలు మౌనికాఇంద్రకరణ్ రెడ్డి దంపతులు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

**బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్నీ సమస్యలే..**

రాష్ట్రం వచ్చాక సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని భావించిన ప్రజలకు నిరాశే ఎదురైందని భట్టి అన్నారు. ఆయన పాదయాత్ర పెద్దపల్లి మండలం హన్మంతునిపేట, రాంపల్లి, మారేడుగొండ మీదుగా కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లికి చేరుకుంది. అక్కడినుంచి మంగపేట, కూనారం నుంచి గంగారం చేరుకున్నారు. మార్గంమధ్యలో పలువురితో మాట్లాడారు. ప్రజలు ఆయనకు పలు సమస్యలను ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నమ్మిన ప్రజలను మోసం చేసిన రాష్ట్రప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు కార్యకర్తలు రథసారథులుగా నిలువాలని పిలుపునిచ్చారు. మండలంలోని గంగారం గ్రామంలో రాత్రి బస చేశారు.

**నేడు కాల్వశ్రీరాంపూర్‌లో బహిరంగ సభ**

భట్టి పాదయాత్రలో భాగంగా గురువారం ఉదయం మండల కేంద్రంలో భారీ బహిరంగ సభ ఉంటుందని, మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ కోరారు. కార్యక్రమంలో ఓదెల జెడ్పీటీసీ గంటా రాములు, సర్పంచులు ఓరుగంటి కొమురయ్యగౌడ్, సజాత, పార్టీ మండల అధ్యక్షుడు మునీర్, మాజీ కో-ఆప్షన్ సజ్జుభయ్యా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మేడి అశోక్‌గౌడ్, మాదాసు సతీశ్, గాజనవేన సదయ్య ఉన్నారు.

# క్రీడామైదానం ఏర్పాటు చేయాలి

- కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న సత్యనారయణ

ఇల్లంతకుంట: మానకొండూర్ నియోజకవర్గంలోని యువతపై ఎమ్మెల్యే నిర్లక్ష్యం చేస్తున్నారని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని మినీస్టేడియంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పోలీస్‌శాఖకు సంబంధించిన స్థలంలో సుమారు రూ.25 లక్షలు ఖర్చుచేసి తెలంగాణ క్రీడా మైదానం ప్రారంభించారని, దాని నిర్మాణంలో ఎంత కమీషన్ తీసుకున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. క్రీడామైదానం స్థలం పోలీస్‌శాఖకు సంబంధించిందని, అందులోకి రావొద్దని క్రీడాకారులను పోలీసులు హెచ్చరిస్తున్నారన్నారు. క్రీడాకారులకు వెంటనే క్రీడాస్థలం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చిట్టి ఆనందరెడ్డి, అంతగిరి వినయ్ కుమార్, బాలపోచయ్య, ఒగ్గు రమేశ్, మామిడి నరేశ్, ఏర్రోజు సంతోష్, బదుగు లింగం, జమాల్, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీని గద్దె దించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జంగం అంజయ్య

వీర్నపల్లి : బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా పనిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం పల్లె పల్లెకు సీపీఐ-ప్రజల వద్దకు సీపీఐ ప్రజాచైతన్య యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16 నుంచి 27వరకు ప్రజా చైతన్యయాత్రలో భాగంగా 22న జరిగే ప్రజాయాత్రలో మండలప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో మల్లారపు లచ్చయ్య, లక్ష్మీనారాయణ, గౌరి రాజం, దేవయ్య, చంద్రయ్య, పర్శయ్య, హన్మాండ్లు, లింబాద్రి, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలను సందర్శించిన డీఈవో

తంగళ్లపల్లి (సిరిసిల్ల): మండలంలోని పాపయ్యపల్లె ప్రాథమిక పాఠశాలను బుధవారం జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్, మండల విద్యాధికారి దూస రఘుపతితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేందర్ రావు, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు పరిహారం చెల్లించి వడ్లు కొనాలి

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల) : వడగళ్ల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ముందుగా ఎకరాకు రూ.10వేలు నష్ట పరిహారం చెల్లించి, ధాన్యం కొనుగోలు చేయాలని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేలు చెల్లిస్తామని ప్రకటించిన సీఎం కేసీఆర్ ఇప్పటికీ ఒక్కపైసా ఇవ్వలేదన్నారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే మంత్రి కేటీఆర్ ఆత్మీయ సమ్మేళనాల పేరుతో జిల్లాల్లో తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు గౌస్, లింగంగౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రాం రెడ్డి, రామచంద్రం, బాబు, ఇమామ్, రమేశ్, పర్శరాములు, రాజు, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంపై ఇరువర్గాల ఫిర్యాదు

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండల కేంద్రంలో బుధవారం రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనపై ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. మండల కేంద్రానికి చెందిన యువతి అదే సామాజిక వర్గానికి చెందిన యువకుడిని ఇటీవల ప్రేమ వివాహం చేసుకుంది. వారి పెళ్లికి హాజరైన పెళ్లికొడుకు స్నేహితుడిని యువతి తండ్రి బెదిరించినట్లు తెలిసింది. ఈక్రమంలో బుధవారం రెండు బైక్‌లు ఢీకొట్టుకున్నాయి. ఈ ఘటనలో పెళ్లికొడుకు స్నేహితుడు గాయపడ్డాడు. కూతురి పెళ్లి విషయాన్ని దృష్టిలో పెట్టుకొని యువతి తండ్రి బైక్‌తో సదరు యువకుడిని ఢీకొట్టినట్లు ప్రచారంలో ఉంది. కాగా యువతి తండ్రి మాత్రం ఫోన్‌లో మాట్లాడుతూ బైక్ నడపడంతోనే ప్రమాదం జరిగిందనే చెబుతున్నాడు. ఈ సంఘటనపై విచారణ చేపట్టామని ఎస్సై రమేశ్ తెలిపారు.

### విద్యుత్‌తీగలు తగిలి అదుపుతప్పిన బైక్

- గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



గాయపడ్డ శ్రీనివాస్‌గౌడ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తెగిపడిన విద్యుత్ తీగలను గమనించకుండా వెళ్లిన గీతాకార్మికుడు బైక్ అదుపుతప్పడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చేయి విరగడంతో చికిత్స పొందుతున్నాడు. మండలంలోని అల్మాస్‌పూర్‌కు చెందిన గీతాకార్మికుడు కందుకూరి శ్రీనివాస్‌గౌడ్ రోజు మాదిరిగానే బుధవారం తెల్లవారుజామున కల్లు తీసేందుకు బైక్‌పై బయలుదేరాడు. గ్రామ శివారులోని పెద్దవేణి ఎలయ్య వ్యవసాయ బావి సమీపంలో తెగి పడి ఉన్న విద్యుత్ తీగలు తగిలి బైక్ అదుపుతప్పింది. ఈ సంఘటనలో శ్రీనివాస్ చేయి విరిగింది. అయితే తీగలు విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పడి ఉన్న శ్రీనివాస్‌ను గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు మండల కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ తీగలు తగిలి పడిపోయిన శ్రీనివాస్‌ను సెస్ సంస్థ ఆదుకోవాలని గౌడ సంఘం ప్రతినిధి పందిర్ల శ్రీనివాస్‌గౌడ్ కోరారు.

### విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

కోనరావుపేట: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. ధర్మారం గ్రామ శివారులో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. వట్టిమల్లకు చెందిన వడ్లకొండ గౌతం బైక్‌ను అతివేగంగా నడుపుతుండగా ఆపారు. వాహనపత్రాలు చూపించాలని కోరగా పోలీసులపై దురుసుగా ప్రవర్తించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. బుధవారం గౌతంను కోర్టులో హాజరుపర్చగా జైలుశిక్ష విధించారు.

### రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం మారుపాక శివారులో బుధవారం కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాలు. కోనరావుపేట మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన మహ్మద్ హైమద్, రేష్మా, చిన్నారులు అస్నాద్, ముత్కల్ కారులో వేములవాడకు వస్తున్నారు. మారుపాక శివారుకు చేరుకోగానే కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. గమనించిన స్థానికులు 108 వాహనంలో నలుగురిని వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇందులో మహ్మద్ హైమద్ తలకు తీవ్రగాయాలై పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

# అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులివ్వాలి

- జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజంకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

సిరిసిల్ల టౌన్ : వేసవి తీవ్రత దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాలను వేసవి సెలవులు ఇవ్వాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు కల్లూరి చందన కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజంకు వినతిపత్రం అందించారు. రోజురోజుకూ ఎండలు పెరగడంతో పిల్లల్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేందుకు తల్లిదండ్రులు సుముఖంగా లేరన్నారు. గర్భిణులు, బాలింతలకు, ప్రీ స్కూల్ పిల్లలకు టీహెచ్‌ఆర్ పంపిణీ చేయాలన్నారు. పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి ఎ. మమత, ఉపాధ్యక్షులు శ్యామల, పద్మ, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

### పురుగు మందు డబ్బాలతో నిరసన

బోయినపల్లి (చొప్పదండి): బోయినపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కొమురయ్య, నాగరాజు, పర్శరాములు బుధవారం సాయంత్రం పురుగుల మందుల డబ్బాలతో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కొదురుపాక నుంచి ఒకరు విధులకు హాజరవుతారని ముగ్గురిలో ఒకరు వేరే చోటకు వెళ్లాలని ప్రచారం జరుగడంతో ముగ్గురు పురుగుల మందు డబ్బాలతో నిరసన చేపట్టినట్లు తెలిసింది. కాగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఏఎంసీ కార్యదర్శి హరనాథ్‌ను వివరణ కోరగా కార్యాలయ సమయం దాటిన తర్వాత ఘటన జరిగిందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

### కనీస వేతనం అందించాలి

బోయినపల్లి: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ పరిధిలో పని చేస్తున్న మండలానికి చెందిన పలువురు వీవోఏలు బుధవారం ఐకేపీ ఏపీఎం చంద్రయ్యకు డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసు అందజేశారు. 20 ఏళ్లుగా వీవోఏలుగా విధులు నిర్వహిస్తున్నా ఏ ప్రభుత్వం గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ. 26 వేలు అందించి, గుర్తింపు ఇవ్వాలని, సెర్ప్ హెచ్‌ఆర్‌పీ అమలు చేయాలని, ఐడీ కార్డులు ఇచ్చి జాబ్ కార్డ్ డిక్లరేషన్ చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే సమ్మె చేస్తామని నోటీస్‌లో పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు వీఏఓలు ఉన్నారు.

### మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ముస్తాబాద్(సిరిసిల్ల): మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని మైనార్టీ కార్పొరేషన్ ఈడీ సర్వర్ అన్నారు. మండలకేంద్రంలో బుధవారం ముస్లింలకు దుస్తులు, కానుకలను అందించి, ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈడీ మాట్లాడుతూ.. ముస్లింలు విద్య, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు, జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ గాండ్ల సుమతి, విజయరామారావు, సురేందర్ రావు, నర్సింహారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు షాదుల్ పాషా, నజీర్, నవాజ్, అన్వర్, జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.

# తాగిన మైకం.. తెలిసిన నిజం?

- రోడ్డు ప్రమాదంలో యువకుని మృతిలో మరో కోణం
- విచారణ చేపట్టిన పోలీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడు మృతి చెందిన ఘటనలో పలు విషయాలు వెలుగుచూస్తున్నాయి. తాగిన మత్తులో ప్రమాదానికి సంబంధించిన విషయాలు బయటపడుతున్నాయి. ముస్తాబాద్‌కు చెందిన కంచం నవీన్ ఈనెల 13న ద్విచక్ర వాహనం అదుపుతప్పి మృతిచెందినట్లు భావించారు. నవీన్ తల్లిదండ్రులు సైతం అలాగే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పొలం నుంచి మధ్యాహ్నం బైక్‌పై ఇంటికొస్తున్న నవీన్‌ను ఎదురుగా ఓ ట్రాక్టర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టిందనే పుకార్లు వినిపిస్తున్నాయి. నవీన్ బంధువులు ఆ విషయంపై ఆరా తీసినట్లు సమాచారం. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అదే దారిలో ఏయే వాహనాలు నడిచాయో తెలుసుకోగా.. ప్రస్తుతం వరికోతలు జోరందుకోగా.. ధాన్యం సరఫరాకు వినియోగించిన పలు ట్రాక్టర్లపై బాధిత కుటుంబానికి అనుమానాలు కలిగాయి. ఆ దిశగా ట్రాక్టర్‌పై పనిచేసిన కూలీలు, రైతులతో తొలుత బాధితుని కుటుంబీకులు సఖ్యతతో మెదిలినట్లు తెలిసింది. అందరూ కలిసి మద్యం తాగుతుండగా నవీన్ మృతికి గల కారణాలు బయటపడ్డట్లు సమాచారం. ఓ ట్రాక్టర్ ఢీకొట్టడంతోనే చనిపోయాడనే విషయం వెలుగుచూసినట్లు తెలుస్తోంది. ఈవిషయంపై ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమకు కూడా ప్రాథమికంగా సమాచారం అందిందన్నారు. నవీన్ మృతిపై విచారణను వేగవంతం చేసినట్లు తెలిపారు. ఇందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.